# నిలకడలేని మనసులు

## ముసునూరి పేరయ్యశాస్త్రి



"మాస్టారూ!

"వస్తున్నాను. ఆఁ...మీరా, రండి...అలా కూర్చోండి."

"కూర్చుంటే పనులవ్వండి. మీరు వెంటనే బయల్దేరి జిల్లాపరిషత్ ఆఫీసు కెళ్లాలి."

"ఆ ప్రయత్నంమీదే వున్నాను."

"ప్రయత్నంమీదున్నానంటే యెలాగండి? ఈసరికి మీరు బస్టాండ్‌లో వుండాలి. ఆఁ... మన సమితి ప్రెశిడెంటుగారిచేత ఫోను చేయించాను. ఛైర్మన్‌గారు చూద్దామన్నారట. గూడెం ట్రాన్సఫర్ కోసమే ఇంకో మాస్టారు ప్రయత్నం చేస్తున్నారని చెప్పానుగా! ఆయన కూడా ఎం. ఎల్. ఏ. చేత చెప్పించాట్ట. వెళ్ళి నా భార్య రోగిష్టిదని, పిల్లలు గూడెం లోనే చదువుతున్నారని... నేను ఒంటరిగా దూరంగా ఉండి యిబ్బందులు పడుతున్నానని కాళ్లావేళ్లాపడండి. మంచివాడే! వినకపోడు."

"ఇంకో మాష్టారు ప్రయత్నిస్తున్నారన్నారుగా; ఆయన పేరేదో చెప్పారు మరచి పోయాను."

"నరసింహారావు. ఆయన కూడా ఈ రోజు జిల్లాపరిషత్ ఆఫీసు కెడుతున్నాట్ట. వెళ్లి ఆయన్నికూడా బతిమాలండి. ఈ ఛాన్సు యిప్పించమని."

విశ్వనాథం మాస్టారు నిట్టూర్చారు.

"రెండు సంవత్సరాలనుంచి ప్రయత్నం, ఈసారైనా పనవుతే నావాళ్ల దగ్గర వుంటాను."

"మీరు బయల్దేరండి" తొందర చేశాడాయన. విశ్వనాథం మాస్టారికి యాభై సంవత్సరాలుంటాయి. మనిషి దృఢకాయుడు.

"ఇదిగో, యిప్పుడే బయల్దేరతాను. బస్సొచ్చే వేళకూడా అయిందిగా!" అనేసి నాలుగు మెతుకులు కతికి, హడావుడిగా యింట్లోంచి బయటపడ్డారు.

*  *  *

పది గంటలకల్లా జిల్లా కేంద్రం చేరుకొన్నారు విశ్వనాథం మాస్టారు. బస్ దిగి సరాసరి జిల్లాపరిషత్ ఆఫీసు కొచ్చారు. అప్పుడే నిద్ర లేస్తోంది ఆఫీసు. రకరకాల చెట్లమధ్య రాతి కట్టడాలతో గంభీరంగాఉన్న ఆఫీసు భవనాలు, మాస్టారికి స్వాగతం పలుకుతున్నట్లుగా భావించి లోపలికొచ్చారు. అక్కడ తిరుగుతున్న మనుష్యుల్లో నరసింహారావు మాస్టారికోసం చూస్తున్నారు. చాలాసేపు మనుష్యుల్ని పరీక్షగాచూసి, తర్వాత ఒకాయన్ని సమీపించారు.

"మీ పేరు" అన్నారు గుచ్చి గుచ్చి ముఖంలోకి చూస్తూ.

ఆ వ్యక్తి విశ్వనాథం మాస్టారివంకోసారి చూసి ఆనక తలదించి "నాపేరు బాబూ రావండి" అన్నాడు.

విశ్వనాథం మాస్టారు నిరాశగా, "అలాగా! ఎక్కడో చూసినట్లు అనిపిస్తేనూ..." అర్థోక్తిగా అనేసి ముందుకు కదిలారు. అర గంట గడిచింది. ఆ మాస్టారికోసం తీవ్రంగా గాలించడం మొదలు పెట్టారు. గడచిపోతున్న ప్రతీ క్షణం తిరిగిరానిదిగా... అవకాశాన్ని జారవిడిచేదిగా భావిస్తూ కంగారు పడిపోతున్నారు. ఎందరో వస్తున్నారు వెడుతున్నారు. ఎవరిని గుర్తించటం? నిరాశగా నడుస్తూ క్యాంటీను దగ్గరకు వచ్చారు. అంతలో క్యాంటీన్ లోపల్నుంచి హడావిడిగా వస్తున్న వ్యక్తిని చూసి, విశ్వనాథంమాస్టారు సంబరపడిపోయారు. ఆ మధ్య ఎలక్షన్ డ్యూటీలో తారసపడిన వ్యక్తాయన బహుశా ఆ నరసింహారావు మాస్టారు ఈయనేకావచ్చు.

సన్నగా రివటలా వున్నాడు. వయసు నలభై దాకా వుండొచ్చు. మనిషి గంభీరంగానే వున్నాడు. విశ్వనాథం మాస్టార్ని దాటి పదడుగులు ముందుకెళ్ళిపోయాడు. విశ్వనాథం మాస్టారు వరుగులాంటి నడకతో అతన్ని చేరుకొన్నాడు.

"మాస్టారూ!" అని పిలిచారు.

అతను ఆగాడు. విశ్వనాథం మాస్టారు అతనిముందుకొచ్చి "మీపేరు నరసింహారావు గారే కదూ!"

"అవును" అన్నాడతను.

విశ్వనాథం మాస్టారి మనసు తేలిక పడింది.

"బ్రతికించారు. మీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నారు విశ్వనాథంమాస్టారు సంతోషంతో.

"నా గురించా!" ఆశ్చర్యపోయాడతను.

"అవునండి. మీతోనే..."

"ఇక్కడే వుంటారుగా! పనుంది... చూసుకొని వస్తాను. వుండండి."

గతుక్కుమన్నారు విశ్వనాథం మాస్టారు. మనిషిని చూస్తే దారిలోకి వచ్చేలా కనిపించడంలేదాయనకి.

"లేదు... ఇప్పుడే మాట్లాడాలి. దయచేసి..." ఆగిపోయారు అర్థోక్తిగా అని.

నరసింహారావు మాస్టారు చిరాగ్గా చూసారాయన వైపు. తప్పదన్నట్లుగా ముఖంపెట్టి "అనుకొన్న సమయానికెళ్ళపోతే పనులవ్వవని మీకు తెలుసుగా! అయినా తప్పేలాలేదు ఏమిటో చెప్పండి" అన్నాడు.

విశ్వనాథం మాస్టారు మెల్లగా కబుర్లలో పడేశారు. ఆ కబుర్లతో అతనిని ఆఫీసు వెనకాలకి తీసికొచ్చారు. గుబురుగా చెట్లు, ఒకవేళ కాళ్ళు పట్టుకోవాల్సివచ్చినా గోప్య ప్రదేశం. జన సంచారం లేదు. పట్టపగలే చీకటి పడ్డట్టుగా వుంది. చల్లగా హాయిగా వుంది వాతావరణం.

"అయ్యా! నేను చాలాకష్టాల్లో వున్నాను. అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమా" అన్నారు రెండు చేతులు జోడించి విశ్వనాథం మాస్టారు.

నరసింహారావు మాస్టారు ఆశ్చర్యపోతూ, "ఏమిటండీ" అన్నాడు.

"అయ్యా, నా భార్య రోగిష్టిది. పిల్లలు గూడెంలోనే చదువుతున్నారు కాలేజీలో. నేను ఒక కుగ్రామంలో పనిచేస్తున్నాను. చాలా రోజులకి గూడెం పోస్టు వుందని తెలిసి ప్రయత్నం చేస్తున్నాను. ఆ పోస్టుకే మీరూ ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఇవి చేతులు కావు... దయుంచి మీరు నాదారి కడ్డు తప్పుకోండి" అన్నారు అతని రెండుచేతులూ పట్టుకొని.

నరసింహారావు మాస్టారి ముఖం అప్రసన్నంగా మారిపోయింది. ముఖంలో కోపం జేవురించింది.

"అదెలాకుదురుతుందండి? అక్కడ నాకు రెండు వ్యాపారాలున్నాయి. అవి చూసుకోవాలి" అన్నాడు.

"మీరు కనికరించాలి!" విశ్వనాథం మాస్టారి కంఠంలో కొన్తంత బాధ

"అనవసరంగా ఈ వ్యవహారంలో వేలు పెట్టకండి." నిక్కచ్చిగా అనేశాడతను.

విశ్వనాథం మాస్టారి ముఖంలో రంగు మారింది. పెదవులు అదురుతున్నాయి చిరు చెమటలు పట్టేసినాయి. శరీరంలోనిరక్తమంతా చల్లబడిపోయినట్లు, నీరసం కమ్మేస్తోంది.

'మరోసారి మీరు ఆలోచించాలి' అభ్యర్థన ధోరణిలో దీనంగా అడిగాడు విశ్వనాథం మాస్టారు.

నరసింహారావు మాస్టారింక ఆలశ్యాన్ని భరించలేకపోతున్నాడు. వెళ్లడానికి వెనక్కి తిరిగి— "లాభంలేదండి" అన్నాడు అడుగు ముందుకు వేస్తూ. విశ్వనాథం మాస్టారతన్ని వెళ్ళనివ్వలేదు. చేయి పట్టుకొన్నారు. నరసింహారావు మాస్టారు ఆగి, విశ్వనాదం మాస్టారి వైపు చూసాడు. ఆయన చూపులు న. మాస్టార్ని కలవర పరచాయి. భారీవిగ్రహమేమో భయపడ్డాడు.

'నన్ను వదలండి' అన్నాడు విశ్వనాథం మాస్టారు.


'వదలను, మర్యాదగా నా దారి కడ్డం తప్పుకోండి.'

"నేను తప్పుకోను."

"తప్పుకోవాలి."

"తప్పుకోను...తప్పుకోను."

విశ్వనాథం మాస్టారిలో సహనం చచ్చిపోయింది. మానవత్వం నశించింది, అవసరం ఆయన్ని పశువుగా మార్చేసింది. ఫలితంగా నరసింహారావు మాస్టారి తల మీద గట్టిగా గుద్దారు. అరవబోయాడు. కానీ అరచేతిని అడ్డంపెట్టి అరవనీయలేదు. మరోగుద్దు... తల తిరిగింది... మరొగొద్దు... అంతే, మొదలు నరికిన చెట్టులా నేల వాలిపోయాడాయన. భయంగా చుట్టూ కలయచూసారు విశ్వనాథం మాస్టారు. గుబురుగా చెట్లు వుండటంవల్ల ఎవరో గమనిస్తారన్న ప్రశక్తి లేదు. మెల్లిగా అతన్ని గోప్యంగావుండేలా వుంచి ...బయట కొచ్చి ముఖం తుడుచుకున్నారు. లోపల కంగారుగా వున్నా, ధైర్యాన్ని తెచ్చు



కౌంటు ఆఫీసులోకి వచ్చారు. ఛైర్మన్‌గార్ని కలవటానికి పర్మిషన్ సంపాదించి, ఆయన గదిలోకి అడుగు పెట్టారు.

"నమస్కారం"

"ఆఁ ... ఏమిటి, చెప్పండి."

అన్నీ వివరంగా చెప్పారు విశ్వనాధం మాస్టారు. కొన్ని క్షణాల తర్వాత, "ఆహాఁ... మీరా... వెళ్లి మీ సెక్షన్ గుమాస్తాని కలవండి." అన్నారు. మరోసారి నమస్కరించి, తనకుసంబంధించిన సెక్షను కెళ్లారు. సుపరిచితమైన వ్యక్తి అవడంవల్ల ఈయన్ని చూడగానే కుర్చీ ఆఫర్ చేసాడా గుమస్తా. స్థిమితంగా లేచిన మాస్టారు బరువుగా నిట్టూర్చి కూర్చుని వచ్చిన సంగతి చెప్పి, "ఛైర్మన్‌గారు మిమ్మల్ని కలవమన్నారు" అన్నారు.

ఆ గుమాస్తా జాలిగా మాస్టారి వంక చూస్తూండి పోయాడు.

"వెరీ సారీ మాస్టారూ !" అన్నాడు.

మాస్టారు కంగారుపడి పోతున్నారు. చావు కబురు వినబోతున్న మనిషి ముఖంలా వాడిపోయింది.

తిరిగి గుమస్తా యిలా అన్నాడు–

"నిన్న రాత్రి వరకు మీకే ఆ వూరిద్దామని నిశ్చయించు కున్నాము. మీ సమితి ప్రెసిడెంటుగారు మనఛైర్మన్‌గారికి ఆప్తుడు. అయితే, ఈ వుదయమే మినిష్టర్ గార్నుంచి ఫోన్ వచ్చింది. ఆయన వత్తిడి వల్ల 'రామారావు' అనే వ్యక్తిని గూడెం వేశారు. వెరీ సారీ మాస్టారూ !" అని.

విశ్వనాధం మాస్టారు లేచి నిలబడ్డారు. మెల్లిగా అడుగులు వేస్తూ బయట కొచ్చారు. ఆయన మనసంతా దిగులుగా వుంది. ఇప్పుడు ట్రాన్సఫర్ అవలేదన్న బాధకన్నా స్వార్ధంతో, పశుతత్వంతో ఆ మాస్టార్ని హింసించానన్నదే ఆయన్ని కృంగదీస్తోంది. ఇద్దరిలో ఒకరికైనా పనవ్వక– మరొడుకాస్తా తన్నుకు పోవడమే ఆయన్ని పిచ్చివాడిగా చేస్తోంది. మెల్లిగా అడుగులు వేస్తూ క్యాంటీన్ దగ్గర కొచ్చారు. చెంబుతో నీళ్ల పట్టుకొని, నరసింహారావు మాస్టార్ని కొట్టి పడేసిన చెట్ల గుబురులోకి వచ్చారు. నరసింహారావు మాస్టారు మెల్లిగా మూల్గుతున్నారు. విశ్వనాధం మాస్టారు ముఖం మీద నీళ్ల చల్లారు. అయిదు నిముషాలు గడిచాయి. విశ్వనాధం మాస్టారు క్రింద కూర్చుని, తన తొడమీద నరసింహారావు మాస్టారి తల పెట్టుకొని ముఖం తుడిచారు.

"అమ్మా..."మూల్గాడు నరసింహారావు మాస్టారు.

"మాస్టారూ !" పిలిచారు విశ్వనాధం మాస్టారు.

మరో అయిదు నిముషాలు గడిచాయి. మెల్లిగా అతను కళ్ళు తెరచాడు అంతా మసగ్గా వున్నట్లు కనిపించింది.

"మాస్టారూ ... " ముఖంలో ముఖం పెట్టి పిలిచారు విశ్వనాధం మాస్టారు. రెండు నిముషాల తర్వాత కాస్త తేరుకొన్నాడతను కళ్లుతెరచి, విశ్వనాధం మాస్టార్నిచూసి కళ్ళు పెద్దవిచేసి చూస్తూండి పోయాడు.


విశ్వనాధం మాస్టారి అవస్థ వర్ణనాతీతం తల పగలుకొట్టుకొని మాస్టారి యెదుటే చచ్చిపోవాలన్నంత బాధగా వుంది. ఏడుపు వచ్చేస్తోంది.

"మాస్టారూ ... నన్ను క్షమించండి. స్వార్ధంతో మానవత్వం విస్మరించి మిమ్మల్ని హింసించాను, నన్ను క్షమించండిమాస్టారూ" అని గొల్లు మన్నారు విశ్వనాధం మాస్టారు.

నరసింహారావు మాస్టారు గొంతు పెగల్చుకొని, "మీ పనయిందా" అన్నాడు నీరసంగా.

"లేదండి. మీకు, నాకు లేకుండా, మూడోవాడు కొట్టుకు పోయాడు" అన్నారు బాధగా !

నరసింహారావు మాస్టారు అంత నీరసంలోను చిరుమందహాసం చేశాడు– ఆ మందహాసంలో వేదాంత ధోరణి విశ్వనాధం మాస్టార్ని ఆలోచింపచేసింది. మానవత్వం లోంచి పశుతత్వంలోకి, పశుతత్వంలోంచి మానవత్వంలోకి ద్వైధీభావంతో నిలకడలేని ఈ మనుషుల మనసు యెంత టక్కరిదో ఆలోచిస్తూ మెల్లిగా లేవదీసి కూర్చో పెట్టారు నరసింహారావుమాస్టారిని.




ఎమెస్కో క్రౌన్ బుక్స్ సిరీస్
ఆగస్టు 82 విడుదల
మనసు కథతో మిమ్మల్ని ఉర్రూతలూగించిన
వాసిరెడ్డి సీతాదేవి
మరో సైకలాజికల్ థ్రిల్లర్ డైరెక్టు నవల
✻ మరో మనసు కథ ✻
ప్రేమికుడి అతి-చిత్రమైన కాంప్లెక్సెస్ వెలికితీస్తే...
మరో మనసు కథ వెల రూ: 12/-లు మాత్రమే
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237 రాష్ట్రపతి రోడ్ సికింద్రాబాద్-500 003